క్లుప్తంగా

26న పద్యగాన, నాట్య శిక్షణ ప్రారంభం

మధిర: ఈ నెల 26న మధిర నియోజకవర్గ సాంస్కృతిక కళా కేంద్రంలో విద్యార్థులకు పద్యగాన, నాట్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ నిభానుపూడి సుబ్బరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సంగీత నాటక అకాడమీ, మధిర సుమిత్ర యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 8:30 గంటల నుంచి 9:30 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందిస్తున్న తహసీల్దార్ చందర్

బోనకల్: మండలంలోని తహసీల్‌లో శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. తహసీల్దార్ పున్నం చందర్, ఆత్మాకమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు ఆరు గ్రామాలకు చెందిన 13మంది లబ్ధిదారులకు చెక్కులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పైడిపల్లి కిశోర్, భద్రూనాయక్, కందుల పాపారావు, జనప్రియకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ గ్రామ సమాఖ్యల ఆర్థిక లావాదేవీల తనిఖీ

కల్లూరురూరల్: మండలంలోని గ్రామ సమాఖ్యలు నిర్వహించే ఆర్థిక పరమైన లావాదేవీల రికార్డులను శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన కేసీకేఆర్ కంపెనీ ప్రతినిధులు రాఘవరెడ్డి, గంగాధర్, డీఎంజీ జిల్లా అధికారి జనార్దన్ తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా తీర్మానాలు, రుణాలు పంపిణీ, రుణాల వసూళ్లు, ఖర్చులు, వ్యయాలు, మండల సమాఖ్యకు సంబంధించిన 20 రకాల పుస్తకాలు, గ్రామ సమాఖ్యలకు చెందిన 11 రకాల రికార్డులను అధికారులు పరిశీలించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

మేలైన గ్రాసంతో పశుసంపద అభివృద్ధి

మధిర: మేలైన పశుగ్రాసమేపుతో పశుగణాభివృద్ధి పెరిగి పాడి పరిశ్రమకు లాభదాయకంగా ఉంటుందని పశువైద్య సిబ్బంది రఫీ అహ్మద్, లక్ష్మణ్‌రావు తెలిపారు. శుక్రవారం సాయిపురం, తొర్లపాడు గ్రామాల్లో మధిర మండల పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్య శిబిరంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. అదేవిధంగా నిరంతరాయంగా పశుగ్రాసం లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కొండలరావు, కిరణ్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

'విజయ'లో ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల సమీపంలో గల విజయ ఇంజనీరింగ్ కళాశాలలో ఎక్సెల్ ఆర్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ వారిచే శుక్రవారం ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎక్సెల్ ఆర్ సంస్థ హెచ్‌ఆర్ మేనేజర్ ఆర్.అవినాష్, హెచ్‌ఆర్ యం.శిల్పా ఆధ్వర్యంలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్‌లో బీటెక్ నాల్గోసంవత్సరం చదువుతున్న 150మంది విద్యార్థులు పాల్గొనగా.. 30మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎంపికైన వారిని కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపల్ డాక్టర్ చిన్నయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆయేషా తరుణమ్ అభినందించారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ శ్రీనివాసరావు, ఏఓ డాక్టర్ ఫరీద్ బాబా వివిధ విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

కారేపల్లి: పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఎం రాష్ట్ర నాయకుడు పి.సోమయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గాంధీనగర్‌లో అమరజీవి ఏలూరి లక్ష్మీనారాయణ స్తూపం వద్ద నిర్వహించిన ఆయన వర్ధంతి సభలో సోమయ్య మాట్లాడారు. కమ్యూనిస్టులకు ప్రాణప్రదమైన వర్గ పోరాటాల నిర్మాత అమరజీవి ఏలూరి అని ఆయన సేవలను కొనియాడారు. ప్రజలను మోసం చేసిన ఏ ప్రభుత్వాలు తమ మనుగడ ఎక్కువ కాలం సాగలేదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కమిటీ సభ్యుడు కేసగాని ఉపేందర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు, మండల కార్యదర్శి నరేంద్ర, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షకు సకాలంలో హాజరుకావాలి

పెనుబల్లి: టేకులపల్లి మోడల్ స్కూల్ ప్రవేశాల కొరకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు హాల్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ టీబీ రూపస్ తెలిపారు. కావున దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని, నిబంధనలు పాటిస్తూ సకాలంలో పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.

గంజాయి మత్తు.. యువత చిత్తు



- వైరాలో విచ్చలవిడిగా వినియోగం
- బానిసవుతున్న విద్యార్థులు, యువత
- ఆందోళనలో తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు



ఇటీవల గంజాయి సేవిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న అబ్కారీ అధికారులు

వైరా: చిన్న వయస్సులోనే యువత మత్తు పదార్థాలకు బానిసై పేడదోవ పడుతున్నారు. కనీసం 20ఏళ్లు కూడా నిండని యువకులు గంజాయి సేవించడం వ్యసనంగా మార్చుకుని ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. ఇవి తెలిసిన తల్లిదండ్రులు ఏమి చేయాలో తోచక మదనపడుతున్నారు. ఈ సంఘటనలు ఎక్కడో కాదు వైరా పట్టణంలో గత కొన్ని నెలలుగా జరుగుతుందంటే.. ఏ స్థాయిలో గంజాయి అమ్మకాలు సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

స్నేహితుల ప్రోత్సాహంతో..

ప్రారంభంలో ఇద్దరు స్నేహితుల మధ్య గంజాయి రుచిని చూసి అదికస్తా అలవాటుగా మారుతుంది. సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి గంజాయి సేవిస్తున్నారు. పట్టణంలో యువకులు, విద్యార్థులు సైతం బానిసలుగా మారడంతో అటు తల్లిదండ్రులు చేతికి వచ్చిన కొడుకులను దండించలేక మందలించి వదిలేస్తున్నారు. వాళ్లల్లో ఎలాంటి మార్పు రాకపోవడంతో దిక్కుతోచని పరిస్థితిలో యువకుల తల్లిదండ్రులు గడపుతున్నారు.

అబ్కారీ శాఖ కార్యాలయానికి అతి సమీపంలో..

గత రెండు రోజుల క్రితం అబ్కారీ శాఖ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఐదుగురు యువకులు అర్ధరాత్రి 12గంటల సమయంలో గంజాయిని సేవిస్తున్నారు. విషయం అబ్కారీశాఖ అధికారులు వెళ్లే క్రమంలో యువకులు పారిపోయారు. ఐదుగురిలో ఇద్దరు యువకులు ఒరిస్సా, భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఏజెంట్ల ద్వారా గంజాయిని వివిధ రూపాల్లో సేకరించి ఇక్కడి యువకులకు అతి తక్కువ ధరకే విక్రయిస్తున్నట్లు సమాచారం.

ఎక్కడ కౌన్సిలింగ్ వంటివి లేవు..

స్థానిక పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో పలు కాలనీలు ఉండడం నిత్యం యువకులు గంజాయి సేవించి తిరుగుతుండడం వంటివి పోలీసులకు తెలుసు కానీ పోలీస్‌శాఖ యువకులకు కనీసం కౌన్సిలింగ్ ఇవ్వడం, మత్తు పదార్థాలు సేవించడం వలన జరిగే నష్టాలపై అవగాహన కల్పించిన దాఖలాలు లేవు.

డ్రగ్ టెస్టు..

అనుమానం వచ్చిన యువకులను అదుపులోకి తీసుకోని అబ్కారీశాఖ అధికారులు కౌన్సిలింగ్ పేరుతో నానా హంగామ సృష్టిస్తున్నారు. డ్రగ్ టెస్టు కోసం మూత్రాన్ని సేకరించి కరుణ శాంపిల్ టెట్టు ఆకారంలో ఉన్న కిట్టు ద్వారా పరీక్షలు చేస్తున్నారు. 5 నిమిషాల్లోనే పరీక్ష ఫలితం రావడంతో గంజాయి సేవించినట్లు ఇటీవల ఒక యువకుడిని గుర్తించారు. వైరా అబ్కారీ స్టేషన్ పరిధిలో ఏడాది కాల వ్యవధిలో 9కేసులు నమోదు అయ్యాయని ఆ శాఖ అధికారులు అంటున్నారు. జిల్లా కేంద్రంలో నోడల్ అధికారాణిని ప్రభుత్వం నియమించగా డ్రగ్ పరీక్ష చేయించాల్సి ఉండగా అబ్కారీ శాఖ అధికారులు వారికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే పరీక్షలు చేయడం విశేషం.

గంజాయి సేవించేది ఎలా అంటే..

పట్టణంలో ప్రధానంగా ఉదయం, సాయంత్రం వేళల్లో హనుమాన్‌బజార్, బ్రహ్మణపల్లి, బోడేపూడి కాలనీ, శాంతినగర్, లీలా సుందరయ్యనగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో మైనర్లు, యువకులు కూడా గంజాయిని పోడిగా చేసి ఆ పొడి సిగరెట్లు కూర్చడం, బాటిల్‌కి హోల్ చేసి ఆ హోల్‌లో పేపర్ లాంటివి రోల్ చేసి వెలిగించి ఆ పేపర్ ద్వారా వచ్చే పొగను పీల్చడం వంటివి చేస్తున్నారు.

కొనుగోలు చేసి.. ప్యాకెట్లుగా మార్చి

వైరా పట్టణంలో కొందరు యువకులు వారంలో నాలుగురోజులు ఖమ్మం, భద్రాచలం, అశ్వారావుపేట ప్రాంతాల్లో తమకు సంబంధించిన వారి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నారు. ఖమ్మంలో బైపాస్ రోడ్డు, ముస్తాఫానగర్, కాల్వొడ్డు బ్రిడ్జి ప్రాంతాల్లో చిన్నపాటి బడ్డీ కొట్లలో రహస్యంగా దాచి ఉంచిన గంజాయిని కిలో రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు కూడా కొనుగోలు చేసి తీసుకొస్తున్నారు. వాటిని వైరాలో చిన్న చిన్న ప్యాకెట్లుగా మార్చి రూ.300 నుండి రూ.వెయ్యి వరకు విక్రయిస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం..



గంజాయి అమ్మకాలపై నిఘా ఏర్పాటు చేసి గంజాయి మత్తులో ఉన్న యువకులకు త్వరలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తాం. ఉదయం, సాయంత్రం వేళల్లో పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేసి గంజాయి సేవిస్తున్న యువకులను అదుపులోకి తీసుకోని విచారణ చేపడతాం. గతంలో గంజాయి సేవించిన యువకుల జాబితాను సేకరించి వారికి కౌన్సిలింగ్ కూడా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– నునావత్ సాగర్, సీఐ, వైరా

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలిరండి



కారేపల్లి: బస్టాండ్ సెంటర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్



తల్లాడ: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

వైరా/కారేపల్లి/తల్లాడ: ఈ నెల 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో జరగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చి సభను జయప్రదం చేయాలని వైరా, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యేలు బానోత్ మదన్‌లాల్, సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. శుక్రవారం వైరాలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరించగా.. కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి, పార్టీ జెండా ఆవిష్కరించారు. అదే విధంగా తల్లాడలో స్థానిక గ్రామ పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద బీఆర్‌ఎస్ జెండా ఎగుర వేశారు. ఈ సదర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఊరు వాడ నుంచి బీఆర్‌ఎస్ జెండా ఎగురవేసి కార్యకర్తలు సభకు రావాలన్నారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రవి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, కృష్ణార్జునరావు, విశ్వేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీలు జగన్, వీరేందర్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బన్సిలాల్, మైనార్టీ జిల్లా నాయకులు గౌసుద్దీన్, రవీందర్, నాగరాజు, చందూనాయక్, వెంకటేశ్వర్లు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, కార్యదర్శి వెంకట్‌లాల్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న తహసీల్దార్ రాంబాబు

మధిర: ఖమ్మంపాడు గ్రామంలో ఇందిరా క్రాంతి పథం ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా ఇందిరా క్రాంతి పథం ఆధ్వర్యంలో 7 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు దళారుల నుంచి రైతులను కాపాడాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఐలూరి సత్యనారాయణరెడ్డి, ఏపీఎం శ్రీనివాసరావు, ఏఓ సాయి దీక్షిత్, సీసీ కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతుల ఆందోళన



కొణిజర్ల: ఐకేపీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న మల్లుపల్లి రైతులు

కొణిజర్ల: ధాన్యం కొనుగోలు చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారంటూ రైతులు స్థానిక ఐకేపీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. రైతులు ధాన్యం తూర్పారా పడితేనే కొంటామని ఐకేపీ వీఓ గ్రూప్ సభ్యులు తెలపడంతో.. మల్లుపల్లి రైతులు ఫ్యాన్లు ఏర్పాటు చేసుకొని తూర్పారా పట్టారు. రెండు లారీల లోడ్‌లను ముదిగొండలోని మండల కేంద్రానికి సమీపంలో ఉన్న రైస్ మిల్లుకు తరలించారు. సదరు మిల్లరు ధాన్యం బాలేవని గత నాలుగురోజులుగా లారీలను నిలిపివేశాడు. దీంతో వీఓలు లారీల రోడ్లు మిల్లులో దిగుమతి అయితేనే కొత్తగా కొనుగోలు చేస్తామని తెలపడంతో.. ఆగ్రహించిన రైతులు ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఐకేపీ సీసీ అశోక్‌రెడ్డి రైతులతో మాట్లాడి.. విషయాన్ని సివిల్‌సప్లై అధికారులకు తెలిపారు. స్పందించిన వారు ముందుగా కాంటా వేయాలంటూ ఆదేశించడంతో వీఓలు కాంటా వేయడంతో రైతులు ఆందోళన విరమించారు.

తహసీల్ ఎదుట ధర్నా..

తల్లాడ: ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ మండలంలోని మల్సూర్‌తండాకు చెందిన రైతులు శుక్రవారం తల్లాడ తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. మల్సూర్‌తండా ధాన్యం కొనుగోలు కేంద్రలో రైతులు తమ ధాన్యాన్ని ఆరబోసి నెల దాటినా కొనుగోళ్లు చేపట్టడంలేదన్నారు. దీంతో ఆగ్రహించిన వారు.. రైతు సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్ ఎదుట ధర్నా చేసి.. తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి మోహన్‌రావు, కృష్ణయ్య, నాగేశ్వరరావు, మస్తాన్, ధశరధ్‌నాయక్, హనుమ, సైదా, బాల, మాన్‌సింగ్, రవి, శ్రీను పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం చింతకాని ఎస్సై నాగుల్‌మీరా పట్టుకున్నారు. చింతకాని మండలంలోని రామకృష్ణాపురం బస్టాండ్ వద్ద బోనకల్‌లోని ఆళ్లపాడు నుంచి ఇసుకను తరలిస్తుండడంతో.. ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అండర్ పాస్ నిర్మించాలి

వైరా: రైతులకు ఇబ్బందులు లేకుండా హైవేపై అండర్‌పాస్ నిర్మాణాలు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆ సంఘ నాయకులు సోమవరం గ్రామం వద్ద.. వైరా రిజర్వాయర్ కుడి కాల్వ వద్ద నిర్మిస్తున్న అండర్‌పాస్‌ను పరిశీలించారు. గోపాలరావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా దీప్తి

మధిర: మధిర మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జిగా ఆర్మూర్ కోర్టులో జడ్జిగా పనిచేస్తున్న దీప్తి నియమితులయ్యారు. ఇప్పటివరకు మధిరలో జడ్జిగా పనిచేసిన కార్తీక్ రెడ్డి బదిలీపై వనపర్తి కోర్టుకు బదిలీపైవెళ్లిన విషయం తెలిసిందే.


గ్రూప్-1లో ర్యాంక్ సాధించిన సుజాతకు సన్మానం



సుజాతను సన్మానిస్తున్న నాయకులు

కల్లూరురూరల్: మండలంలోని పేరువంచ గ్రామానికి చెందిన మంచాల సుజాత గ్రూప్–1 ఫలితాల్లో మంచి ర్యాంక్ పొంది ఉద్యోగం సాధించినందుకు గాను రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టా దయానంద్, కల్లూరు ఏఎంసీ చైర్మన్ భాగం నీరజాదేవి, జిల్లా కాంగ్రెస్ నాయకులు పసుమర్తి చందర్‌రావు శుక్రవారం సన్మానించారు. మంచాల సుజాత ప్రస్తుతం దమ్మపేట మండలంలో కానిస్టేబుల్‌గా పని చేస్తూ గ్రూప్–1 ఉద్యోగం సాధించారు. సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భాగం ప్రభాకర్, కీసర వీరమోహన్‌రెడ్డి, పరిమి భరత్ పాల్గొన్నారు.

సీడీఏ సేవలు అభినందనీయం



మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఆర్డీఓ రాజేందర్

కల్లూరు: మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇచ్చి వారికి కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తున్న సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ సేవలు అభినందనీయమని కల్లూరు ఆర్డీఓ ఎల్.రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం కల్లూరు చంద్రుపట్ల రోడ్డులో సీడీఏ ద్వారా కార్యదర్శి పి.ఎనోష్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళలకు 6నెలలు శిక్షణ, ఉచిత కుట్టు మిషన్లు ఇవ్వగా.. వాటిని ఆర్డీఓ చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో చంద్రలీల, రజనీకాంత్, కిరణ్‌కుమార్, ఏఐసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, మీడియాసెల్ జిల్లా అధ్యక్షులు డేవిడ్ రాజ్, ఎబినేజర్, సమర్పణపాల్, టిక్నో నాగిరెడ్డి పాల్గొన్నారు.

తోపుడుబండి వితరణ

వైరా: వైరా గ్రేటర్ విజన్ లయన్స్‌క్లబ్ సభ్యులు డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మి దంపతుల కుమార్తె ఉంద్రు అక్షర శిరి జన్మదినాన్ని పురస్కరించుకుని వైరాకు చెందిన చిరు వ్యాపారి రాధకు శుక్రవారం తోపుడు బండిని వితరణ చేశారు. పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మురళీ కృష్ణ చేతులమీదుగా తోపుడు బండి అందజేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, కిషన్‌రాయ్, రామకృష్ణ, మహాలక్ష్మి, రాంగోపాల్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'



వైరా: మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా/ఏన్కూరు: రైతుల భూ సమస్యలు పరిష్కరించడానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం, కల్లూరు ఆర్డీఓలు జి.నరసింహారావు, ఎల్.రాజేందర్ తెలిపారు. శనివారం వైరాలోని కామిశెట్టి, ఏన్కూరులోని కమ్మవారి కల్యాణ మండపాల్లో తెలంగాణ భూ భారతి చట్టం 2025పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ చట్టం రాజకీయాల కోసం ఏర్పాటు చేసింది కాదని, రైతాంగానికి భూ సమస్యలు పరిష్కరించి భూమిపై శాశ్వత హక్కులు కలిపించేందుకే చట్టం రూపొందించడం జరిగిందన్నారు. గతంలో ఉన్న వీఆర్‌ఓ వ్యవస్థ, అనుభవదారు కాలం మళ్లీ వస్తుందన్నారు. అధికారుల అందించిన ఆర్డర్లపై అప్పీలు చేసుకునే అధికారం ఈ చట్టం ప్రకారం ఉంటుందన్నారు. వారసత్వం వీలునామా ద్వారా భూమిపై హక్కులు ఉంటే తహసీల్దార్ విచారణ జరిపి మ్యుటేషన్ చేస్తారన్నారు. నెలరోజుల్లో మ్యుటేషన్ చేయకపోతే ఆటోమేటిక్‌గా మ్యుటేషన్ జరుగుతుందన్నారు. పెండింగ్ సాదా బైనామాల కోసం ప్రభుత్వం భూ భారతి చట్టంలో అవకాశం కలిపిస్తుందన్నారు. అదే విధంగా వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్‌ఈసీ చదువుతున్న విద్యార్థికి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించడంతో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ విద్యార్థి ఎస్.మణి సంపన్నను కళాశాలలో కలిసి శాలువ, జ్ఞాపికతో సత్కరించి అభినందించారు. కళాశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ కార్యక్రమాలల్లో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, తహసీల్దార్లు శేషగిరిరావు, శ్రీనివాస్, ఎంపీడీఓలు సరస్వతి, రమేష్, ఏఓ నరసింహారావు, ఎంపీఓ జీపీఎస్ నారాయణ, ఏడీఏ కరుణశ్రీ, మున్సిపల్ కమిషనర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

వైరా రిజర్వాయర్ కుడి కాలువ గైడ్‌వాల్స్ నిర్మాణ పనులకు శంకుస్థాపన..

వైరారూరల్: వైరా రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల రెండో దశ ఆధునీకరణ పనుల్లో భాగంగా శుక్రవారం మండలంలోని తాటిపూడిలో రిజర్వాయర్ కుడి కాలువకు నిర్మించే గైడ్ వాల్స్‌ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ శంకుస్థాపన చేశారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందన్నారు. రిజర్వాయర్ పనులు పూర్తిఅయితే ఆయకట్టు చివరి భూములకు కాలువల ద్వారా ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుందన్నారు. పనులు పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పీసీసీ కార్యదర్శి రంగారావు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతారాములు, పమ్మి అశోక్, జవ్వాజి నాగరాజు, నీటిపారుదల శాఖ డీఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

మధిర: ప్రతి బిడ్డకు సంపూర్ణ వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పృథ్వీరాజ్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండలంలో ప్రత్యేక టీకాల డ్రాప్ అవుట్ గుర్తించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో, పట్టణంలో పారామెడికల్ సిబ్బంది ద్వారా ఇంటెన్సీ ఫైడ్ మిషన్ ఇంద్ర ధనస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరైతే జీరో నుంచి 5 సంవత్సరాలలోపు పిల్లలకు సంపూర్ణంగా టీకాలు వేయించకుండా డ్రాప్ అవుట్ మిగిలిన వారిని గుర్తించి.. వారందరికీ ఈ నెల 21 నుంచి 26 వరకు టీకాలు వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి పిల్లల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకటేశ్వర్లు, లంకా కొండయ్య, హెల్త్ సూపర్వైజర్లు, ఏఎన్‌ఎంలు ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి ముస్లింల నిరసన



సత్తుపల్లిలో నిరసన తెలుపుతున్న ముస్లింలు



కల్లూరు జామియా మసీదులో..

సత్తుపల్లి/మధిర/వైరా/కల్లూరు: పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా వైరా రింగ్ రోడ్డు సెంటర్ నుండి పాతసెంటర్ ఏరియా వరకు, సత్తుపల్లి, మధిరలో జామే మసీదు కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అదే విధంగా మధిరలో మధిర స్విమ్మర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం కాంగ్రెస్ నాయకులు, ముస్లింలు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ముస్లింలు మాట్లాడుతూ.. ఇది ముమ్మాటికి పిరికిపందల చర్య అని, అమాయక ప్రజలను బలి తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. దేశంలో కుల మతాలకు అతీతంగా సోదరభావంతో నివసిస్తున్నారని, కొంతమంది ముష్కరులు కుల మతాల మధ్య చిచ్చు పెట్టడంతో పాటు దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతి ఒక్కరూ ఈ ఘటనను ఖండించాలని, భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లిలో.. జామే మసీదు అధ్యక్ష, కార్యదర్శులు నాయబ్ రసూల్, ఎండి కమల్‌పాషా, ఎండి ఫయాజ్ ఆలీ, సయ్యద్ సలీం, ఎండి రియాజుద్దీన్, ఎస్కె ఆయూబ్‌పాషా, ఎస్కె మౌలాన, ఎండి షేరాజ్, షౌకత్, ఎండి నసీమ్, సయ్యద్ ఖలీల్, అబ్దుల్ ఖాదర్, ఫయాజ్, ముబారక్, ఇబ్రహీం, మధిరలో.. మజీద్ ఉపాధ్యక్షులు షేక్ జహంగీర్, వైరాలో.. మసీద్ కమిటీ అధ్యక్షుడు షేక్. రసూల్, రహమాన్, అన్వర్, కౌసర్, ఫిరోజ్, రహీమ్, కల్లూరులో.. మండల ముస్లిం కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అలీ, జామియా మసీదు కమిటీ సదర్ ఎండీ హనీఫ్, సయ్యద్ అమీరుద్దీన్, యాకూబ్ అలీ, మహబూబ్, తురాబల్లి, ఎస్‌డీ ఇషాక్, ఎస్‌కే ఉస్మాన్, ఎస్‌కే ఇస్మాయిల్, ఎస్‌కే కమ్లి, సుభాని, ముజీబ్, జలాలుద్దీన్, వజీర్, బాబా, ముజాహిద్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి



చింతకాని: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చింతకాని/ఎర్రుపాలెం/ముదిగొండ: మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బనిగండ్లపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంత్, చింతకాని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్, ముదిగొండ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అరుణాదేవి తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఎర్రుపాలెం మండలంలోని బనిగండ్లపాడు పీహెచ్‌సీలో రోగులకు మలేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. చింతకానిలో, ముదిగొండలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. ప్రతి శుక్రవారం డ్రైడే, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. మలేరియా అనేది కీటక జనిత వ్యాధి అని, దోమలను నివారిస్తే మలేరియాను నిర్మూలించవచ్చునని తెలిపారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రంజిత్, కార్తీక్, అశ్విని, లోహిత, డాక్టర్ తబసుమ్, సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ సైదులు, సిబ్బంది కాంతమ్మ, పద్మావతి, వేణుగోపాల్, పద్మజా రాణి, సాయిరెడ్డి, సుధాకర్, అశోక్,వెంకటేశ్వరరెడ్డి, శ్రీను, సీహెచ్ మధుసూదన్‌రావు, పీహెచ్‌ఎన్ రాణి, సూపర్‌వైజర్స్ పద్మావతి, లత, స్టాఫ్‌నర్స్ నాగరాజాకుమారి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో..



సత్తుపల్లిటౌన్: ర్యాలీలో వైద్యాధికారులు అవినాష్, స్పందన, వైద్య సిబ్బంది

సత్తుపల్లిటౌన్/పెనుబల్లి/తల్లాడ: ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం సత్తుపల్లి మండలం గంగారంలో, పెనుబల్లిలోని లంకాసాగర్‌లో, తల్లాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు ఆర్.అవినాష్, స్పందన, కిరణ్‌కుమార్, ఐ.రత్న మనోహర్ ప్రదర్శలో పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు వెంకటేశ్వర్లు, శారారాణి, రామారావు, దుర్గారావు, వేణుగోపాల్, వేణుగోపాల్, డాక్టర్ కిరణ్‌కుమార్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పులమ్మ, సూపర్‌వైజర్ పెద్ద పుల్లయ్య, భద్రమ్మ, జాన్సీ, లక్ష్మి, కళావతి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణ, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నప్రాసన

బోనకల్: మండలంలోని చొప్పకట్లపాలెం, గోవిందాపురం గ్రామాల్లో శుక్రవారం చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ.. 6నెలలు నిండిన తరువాత చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు తప్పనిసరిగా బాలామృతాన్ని తినిపించాలన్నారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, రమాదేవి, ఏఎన్‌ఎమ్, ఆశాలు పాల్గొన్నారు.